క్లుప్తంగా

32 మందికి కంటి పరీక్షలు



వృద్ధులకు కంటివైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

తాడిమర్రి: మండలంలోనిఎం.అగ్రహారం గ్రామంలో కంటి వైద్యాధికారులు గురువారం వృద్ధులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఆప్తాలమిక్ అధికారి సికిందర్ 32 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేశారు. వారిలో 8 మందిని శస్త్ర చికిత్సలకు, 19 మందికి కంటి అద్దాలకు ఎంపిక చేశారు. మిగిలిన ఐదుగురికి మందులు ఇచ్చి పంపారు. శస్త్ర చికిత్సలకు ఎంపికై న వారిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ మనోహర్‌బాబు, ఏఎన్‌ఎం లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఐనోద్దీన్

కదిరి టౌన్: ప్రైవేట్ ఆస్పత్రుల్లోని స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఐనోద్దీన్ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని కదిరి ప్రభుత్వ ఆస్పత్రిలో పీసీపీఎన్‌డీటీ డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కదిరి డివిజన్‌లోని స్కానింగ్ సెంటర్లపై వైద్య ఆరోగ్య, రెవెన్యూ పోలీస్ డిపార్ట్‌మెంట్ ద్వారా ప్రత్యేక నిఘా పెట్టినట్లు పేర్కొన్నారు. ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే.. చట్టరీత్యా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెంటర్లను అవసరమైతే సీజ్ చేస్తామన్నారు. మెడికల్ స్టోర్‌లో అబార్షన్ కిట్లు అమ్మకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్, ఆర్డీఓ రాఘవేంద్ర, డీఎస్పీ శ్రీలత, బాబాఫక్రుద్దీన్, మెడికల్ ఆఫీసర్ ఉషారాణి, రెడ్స్, పీఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఏబీ ఓబిరెడ్డి

తాడిమర్రి: మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, కేతిరెడ్డి సూర్యప్రతాప్ రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఏబీ ఓబిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విన్నర్స్‌కు రూ.30 వేలు, రన్నర్స్‌కు రూ.20 వేల నగదు బహుమతి ఉంటుందన్నారు. క్రికెట్ పోటీల్లో అందరు సమానమేనన్నారు. ఎటువంటి గొడవలు, ఘర్షణలు చోటు చేసుకోకుండా టోర్నమెంట్‌ను ప్రశాంతంగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో హనుమంతరెడ్డి, రాజేంద్రప్రసాద్, సన్నప్పయ్య, హరి, నన్నెసాహెబ్, రాజప్ప, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

సజావుగా పింఛన్ల పంపిణీ



అనంతపురంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకటేష్‌కు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఆదినారాయణ

బత్తలపల్లి: పండుగైనా.. సెలవైనా 1వ తేదీనే లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్ అందజేస్తున్నారు. జూన్ నెలకు గాను గురువారం ఉదయానికే 50 శాతం పింఛన్ల పంపిణీ కావడం గమనార్హం. సర్వర్లు బిజీగా ఉంటాయన్న ఉద్దేశంతో మండలంలో కొందరు వలంటీర్లు తెల్లవారుజామునే పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. మండలంలో వృద్ధాప్య, వితంతు, వికలాంగ తదితర సామాజిక పింఛన్లు మొత్తం 6,184 ఉన్నాయి. 4,328 మందికి (800 శాతం) పింఛన్ సొమ్ము అందజేశారు. ఇదిలా ఉండగా మండలంలోని ఎం.చెర్లోపల్లి గ్రామానికి చెందిన ముద్దపాటి వెంకటేష్ అనారోగ్యంతో అనంతపురంలోని సవేరా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ ఆదినారాయణ ఆసుపత్రి వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు.

‘నకిలీ’లతో జర భద్రం

- విత్తనాలు, పురుగుమందుల కొనుగోళ్లకు ఒరిజినల్ రశీదులు తప్పనిసరి
- అనుమతి పొందిన దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేయాలి
- ఏఓ ఓబిరెడ్డి



బత్తలపల్లి: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు పొలాలకు ఎరువులు తోలడం, దుక్కులు దున్నడం తదితర పనులు ప్రారంభించారు. వాతావరణం పూర్తి స్థాయిలో అనుకూలించి, వర్షాలు కురిస్తే విత్తన సాగుకు శ్రీకారం చుట్టనున్నారు. బత్తలపల్లి మండలంలో ఈ సీజన్‌లో ముఖ్యంగా వేరుశనగ పంటపైనే రైతులు దృష్టి సారించారు. నీటి వసతి ఎక్కువగా ఉన్నచోట్ల వరి కూడా సాగుపై దృష్టి సారించనున్నారు. వ్యవసాయశాఖ ద్వారా అందించే రాయితీ విత్తనాలపైనే ఆధారపడకుండా రైతులు ప్రవేట్ దుకాణాల్లో లభించే విత్తనాలపై ఆధారపడుతున్నారు. తక్కువ ధరలో ఎక్కువ దిగుబడి నిచ్చే విత్తనాలు తమ వద్ద లభిస్తాయంటూ కొందరు వ్యాపారులు ఇప్పటికే రైతులను మభ్యపెడుతున్నారు.

మోసపోతే భారీ నష్టమే

నకిలీ విత్తనాల భారిన పడి రైతులు ప్రతి ఏడాది అధికంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో నకిలీ విత్తనాలను ముందే గుర్తించకపోతే నష్టపోక తప్పదని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు. అధికారుల సూచనలు, జాగ్రత్తలు తప్పక పాటించాల్సి ఉంది. తగు జాగ్రత్తలు తీసుకొంటే నష్టపోయిన వారు సంబంధిత కంపెనీల నుంచి పరిహారం పొందవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా..

వ్యవసాయశాఖ ద్వారా అనుమతి పొందిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. కొన్ని చోట్ల ప్రభుత్వ అనుమతి లేని అనధికార విత్తన వ్యాపారాలు తెల్లసంచుల్లో నకిలీ విత్తనాలను విక్రయించే అవకాశం ఉన్నందున వారి సమాచారాన్ని తక్షణమే అధికారులకు తెలియజేయాలి. ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థల నుంచే సర్టిఫైడ్ విత్తనాలు కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించిన బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలి. బిల్లులపై రైతు చిరునామా, గడువు తేదీ, విత్తన ధర, కంపెనీ పేరు, అమ్మినవారి సంతకం తప్పనిసరిగా ఉండేలా జాగ్రత్త పడాలి. విత్తన బస్తాపై ముద్రించిన ధ్రువ పత్రం బిల్లును పంట చేతికి వచ్చే వరకూ భద్రపరుచుకోవాలి. విత్తనాలు కొన్న వెంటనే మొలక శాతం పరిక్షించుకోవాలి. కనీసం మొలక శాతం 75 ఉంటేనే విత్తనంగా వినియోగించుకోవాలి. విత్తన సంచులను రైతులు నమూనా వివరాల కోసం పంట కోతకు వచ్చే వరకూ దాచుకోవాలి.

పరిహారం పొందడం ఇలా..



నకిలీ విత్తనాలతో మోసపోతే వెంటనే వ్యవసాయాధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులు విత్తన నాణ్యత ప్రమాణాల కన్నా తక్కువ మొలక శాతం నుంచి దిగుబడి ప్రభావితం చేసినట్లు భావిస్తే ఆ కంపెనీపై మండల వ్యవసాయాధికారి ద్వారా జిల్లా వ్యవసాయ సంచాలకులకు ఫిర్యాదు చేయవచ్చు. వారి ద్వారా పరిహారం పొందడానికి బిల్లులు భద్రపరుచుకోవడం ద్వారా మోసపోయిన రైతులు నకిలీ విత్తనాలు అమ్మిన వ్యాపారులపై ఫిర్యాదు చేయవచ్చు.

– ఓబిరెడ్డి, ఏఓ, బత్తలపల్లి

వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల కమిటీల ఏర్పాటు

పుట్టపర్తి అర్బన్: వైఎస్సార్‌సీపీకి వెన్నెముకగా నిలిచిన కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని అమడగూరు మండలానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, రైతు, యువత, మహిళా సంఘాల అనుబంధ సంఘాలను ఏర్పాటు చేశారు. ఒక్కో సంఘానికి అధ్యక్ష, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులుగా 23 మందిని ఎంపిక చేశారు. ఎస్సీ అనుబంధ కమిటీ అధ్యక్షుడిగా చినగానిపల్లి మల్లికార్జున, ఉపాధ్యక్షులుగా జేకేపల్లి రమణప్ప, మహమ్మదాబాద్ గంగాద్రి ఎంపికయ్యారు. ఎస్టీ విభాగం కమిటీ అధ్యక్షుడిగా పూలకుంట్లపల్లి వెంకట రమణనాయక్, ఉపాధ్యక్షుడిగా తుమ్మల రవీంద్రనాయక్, చీకిరేవులపల్లి ఆదినారాయణ ఎంపికయ్యారు. మైనార్టీ విభాగం కమిటీ అధ్యక్షుడిగా మహమ్మదాబాద్ అన్సర్‌బాషా, ఉపాధ్యక్షుడిగా అమడగూరు షేక్ బాబ్జాన్, పూలకుంట్లపల్లి ముస్కిన్‌ను ఎంపిక చేశారు. బీసీ విభాగం కమిటీ అధ్యక్షుడిగా తనకంటిపల్లి చౌడప్ప, ఉపాధ్యక్షులుగా అమడగూరు రామాంజనేయులు, గుండువారిపల్లి శ్రీరాములు ఎంపికయ్యారు. రైతు విభాగం కమిటీ అధ్యక్షుడిగా ఎగువగువ్వలపల్లి ధర్మారెడ్డి, ఉపాధ్యక్షులుగా చినగానిపల్లి ఆదినారాయణరెడ్డి, కసముద్రం రామకృష్ణను ఎంపిక చేశారు. యూత్ విభాగం కమిటీ అధ్యక్షుడిగా జేకేపల్లి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులుగా అమడగూరు గోపీనాథ్, బలకవారిపల్లి అమరనాథ్ రెడ్డిని ఎంపిక చేశారు. మహిళా విభాగం కమిటీ అధ్యక్షురాలిగా అమడగూరు మనెమ్మ, ఉపాధ్యక్షురాళ్లగా మహమ్మదాబాద్ గంగులమ్మ, చీకిరేవులపల్లి రత్నమ్మ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీల సభ్యులు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి డీఎస్ కేశవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



చినగానిపల్లి మల్లికార్జున



వెంకట రమణనాయక్



మహమ్మదాబాద్ అన్సర్ బాష



తనకంటిపల్లి చౌడప్ప



ఎగువగువ్వలపల్లి ధర్మారెడ్డి



జేకేపల్లి శ్రీనివాసరెడ్డి



అమడగూరు మణెమ్మ

కంప్యూటర్ ధ్వంసం



ఓడీ చెరువు: మండలంలోని తంగేడుకుంట గ్రామ సచివాలయంలోని కంప్యూటర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గురువారం ఉదయం సచివాలయ ఉద్యోగులు సచివాలయానికి వచ్చి ఫీల్డ్‌కు వెళ్లారు. ఈ సమయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తి సచివాలయంలోకి ప్రవేశించి, కంప్యూటర్ మానిటర్‌ను ధ్వంసం చేశారు. అనంతరం సర్పంచ్ అబీదాబాను, కార్యదర్శి రఫీతో కలిసి సచివాలయ ఉద్యోగులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సమస్యలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న తాత్కాలిక మున్సిపల్ చైర్‌పర్సన్ యర్రగుంట్ల భాగ్యలక్ష్మి

ధర్మవరం: పట్టణంలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని తాత్కాలిక మున్సిపల్ చైర్‌పర్సన్ యర్రగుంట్ల భాగ్యలక్ష్మి ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు తెలిపిన పలు సమస్యలపై అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కుక్కల బెడద, వార్డుల్లో వీధిలైట్లు, వాటర్ ప్లాంట్లలో నీటిని సరిగ్గా శుద్ధి చేయడం లేదంటూ.. ఎక్కువ ధరకు నీటిని అమ్ముతున్నారని పలువురు కౌన్సిలర్లు కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారన్నారు. వచ్చే కౌన్సిల్ సమావేశం లోపు కౌన్సిలర్లు చెప్పిన సమస్యలను సత్వరమే పరిష్కరించేలా ప్రణాళికలు చేపట్టాలని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఇసుక నిల్వల పరిశీలన

పరిగి: మండల కేంద్రంలోని జయమంగళి నది నుంచి గుత్తేదారు అక్రమంగా డంప్ చేసిన ఇసుక నిల్వలను గురువారం హిందూపురం సెబ్ అధికారులు పరిశీలించారు. జేపీ కన్‌స్ట్రక్షన్ శాండ్ కంపెనీకి చెందిన గుత్తేదారు రీచ్ నుంచి ఇసుకను బయటకు తోలి వేరే ప్రాంతంలో డంప్ చేశారు. సెబ్ అధికారులు డంప్ చేసిన ప్రదేశాన్ని పరిశీలించి, సంబంధిత గుత్తేదారుతో మాట్లాడారు. తదుపరి చర్యలకై ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు తెలిపారు.

మధ్యప్రదేశ్ సత్యసాయి భక్తుల పర్తియాత్ర

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా మధ్య ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సత్యసాయి భక్తులు ఈనెల 3,4 తేదీల్లో పుట్టపర్తికి రానున్నట్లు రేడియో సాయి ప్రతినిధి వినోద్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు ప్రశాంతి నిలయంలో ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సుమారు 1,500 మంది భక్తులు పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి చేరుకుంటారని వెల్లడించారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

తలుపుల: మండలంలోని రాజనోల్లపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎస్‌ఐ మున్వర్ బాషా ఆధ్వర్యంలో గురువారం పోలీసులు దాడి చేశారు. 5 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.65,910 స్వాధీనం చేసుకున్నారు. మండలంలో ఎక్కడైనా పేకాట, మట్కా, సారా అమ్మినా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని ఎస్‌ఐ హెచ్చరించారు.

గర్భస్రావం చేయించుకోవడం నేరం



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సొలోమన్ సెల్వియా

తాడిమర్రి: గర్భస్థ శిశు మరణాల నివారణకు కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సొలోమన్ సెల్వియా ఆదేశించారు. గురువారం మండలంలోని ఎం.అగ్రహారం వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో వైద్యాధికారి డాక్టర్ మహేంద్రనాథ్ అధ్యక్షతన ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇటీవల గర్భిణులు స్కానింగ్ చేయించుకుని పుట్టబోయేది ఆడపిల్ల అని తెలయగానే గర్భస్రావం చేయించుకుంటున్నారన్నారు. మొదటి, రెండో కాన్పు గర్భిణులు కూడా గర్భస్రావం చేయించుకోవడం సరికాదన్నారు. కమీషన్లకు ఆశపడి ఆర్‌ఎంపీలు స్కానింగ్‌ల కోసం పట్టణాలకు రెఫర్ చేస్తున్నారన్నారు. వైద్యాధికారులు వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గర్భిణులు ఆర్‌ఎంపీల వద్దకు వెళ్లకుండా అవగాహన కల్పించాలన్నారు. గర్భస్రావం చేయించుకోవడం నేరమని తెలిపారు. ఈ విషయంపై ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు గ్రామాల్లో మహిళలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. క్రమం తప్పకుండా టీకాలు వేయించు కోవడం, పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవడం, కాన్పులకు ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లడం, 108 వాహనాలను వినియోగించు కోవడం తదితర విషయాలపై వివరించాలన్నారు. అలాగే వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓలు మనోహర్‌బాబు, నారాయణస్వామి, సూపర్‌వైజర్ రామ్‌కుమార్, ఏఎన్‌ఎ లక్ష్మీకాంత, ఆరోగ్య కార్యకర్త హర్షవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాసవీక్లబ్ ఆసుపత్రి ట్రస్ట్ సేవలు అమూల్యం



గొడుగులు అందిస్తున్న తహసీల్దార్ యుగేశ్వరి దేవి, వాసవీక్లబ్ ఆసుపత్రి ట్రస్ట్ సభ్యులు

ధర్మవరం అర్బన్: చిరు వ్యాపారులు ఎండలో ఇబ్బందులు పడకుండా వాసవీక్లబ్ ఆసుపత్రి ట్రస్ట్ వారు పెద్ద గొడుగులను అందించడం అభినందనీయమని తహసీల్దార్ యుగేశ్వరిదేవి తెలిపారు. పట్టణంలోని వాసవీక్లబ్ ఆసుపత్రి ట్రస్ట్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం చిరు వ్యాపారులకు పెద్ద గొడుగులను పంపిణీ చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. ఎండాకాలంలో చిరు వ్యాపారులకు గొడుగులు ఉపయోగపడుతాయన్నారు. వాసవీక్లబ్ ఆసుపత్రి ట్రస్ట్ చేస్తున్న సేవలు హర్షణీయమని తెలిపారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ ఆసుపత్రి అధ్యక్షుడు నాగ, కార్యదర్శి మోకా రవి, కోశాధికారి లలిత్, రీజనల్ చైర్మన్ నాగసత్య శ్రీనివాస్, జోనల్ చైర్మన్ వంశీరామ్, మాజీ కౌన్సిలర్ అంబటి బద్రీనాథ్, సభ్యులు దేవతా కృష్ణమూర్తి, కలవల రాధ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న మేనేజర్ సత్యనారాయణ గౌడ్

పుట్టపర్తి టౌన్: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ పని చేస్తోందని మేనేజర్ సత్యనారాయణ గౌడ్ తెలిపారు. గురువారం పట్టణంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఖాతాదారులతో సమావేశం నిర్వహించి బ్యాంక్ అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంగా అతితక్కువ వడ్డీ రేటుకు అత్యధికంగా బంగారు రుణాలు, పంట రుణాలు, డ్వాక్రా రుణాలు అందిస్తున్నామన్నారు. మొబైల్ బ్యాంకింగ్ యూపీఐ అన్ని రకాల డిజిటల్ సదుపాయలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సుబ్బిరెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ నాగార్జున, వెంకటేశ్వర్లు, క్యాషియర్ వీరాస్వామి నాయుడు, ఆధార్ ఆపరేటర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు చోరీ

కదిరి టౌన్: పట్టణంలోని మారుతీనగర్‌లో చోరీ జరిగినట్లు బాధితుడు మహమ్మద్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గురువారం రాత్రి ఫిర్యాదు చేశారు. మారుతీనగర్‌కు చెందిన మహమ్మద్ కుటుంబ సభ్యులతో కలిసి రెండు రోజుల క్రితం బంధువుల ఊరికి వెళ్లారు. అది గమనించిన దుండగులు తలుపులు పగలకొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాల్లో దాచిన ఆరున్నర తులాల బంగారు, రూ.26 వేల నగదు దొచుకెళ్లారు. గురువారం సాయంత్రం ఊరి నుంచి తిరిగివచ్చిన మహమ్మద్ చోరీ జరిగినట్లు గుర్తించారు. తలుపులు తెరిచి చూడటంతో బీరువాల్లో నగదు బంగారు కనిపించలేదు. వెంటనే పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గుర్తింపు లేని పాఠశాలల్లో పిల్లల్ని చేర్చవద్దు

కొత్తచెరువు: ఇటీవల పుట్టపర్తి, కొత్తచెరువు మండలాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా కొంత మంది పాఠశాలలను ప్రారంభించి విద్యార్థులను చేర్చుకుంటున్నట్లు సమాచారం అందుతోందని పుట్టపర్తి, కొత్తచెరువు మండలాల విద్యాధికారి టి.వెంకటరమణ నాయక్ తెలిపారు. ఇలాంటి మోసపూరిత పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పవద్దని గురువారం ఆయన ఓ ప్రకటనలో కోరారు. గుర్తింపు లేని పాఠశాలలు ఏవైనా ఉంటే తెలియజేయాలని సూచించారు. గుర్తింపు లేని పాఠశాలల్లో మీ పిల్లలను చేర్పితే మండల విద్యాశాఖ బాధ్యత వహించదని తెలిపారు.

పిడుగుపాటుకు ఆవుల మృతి



కొత్తచెరువు: మండల పరిధిలోని పాతదేవర పల్లిలో గురువారం రాత్రి పిడుగులు, ఉరుములతో కురిసిన వర్షానికి పిడుగుపడి రెండు ఆవులు మృతి చెందాయి. వివరాలు.. శివయ్యకు రెండు పాడి ఆవులు ఉన్నాయి. రాత్రి కురిసిన వర్షానికి పాడి ఆవుల సమీపంలో పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాయి. రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

ఆటో బోల్తా: నలుగురికి గాయాలు

కదిరి అర్బన్: మండల పరిధిలోని కొండమనాయుని పాళెం గ్రామం సమీపంలో గురువారం ఆటో బోల్తా పడిన ఘటనలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. నల్లమాడ వైపు నుంచి కదిరికి ఆటో వస్తుండగా కొండమనాయుని పాళెం మలుపు వద్ద అదుపు తప్పింది. ఇందులో ప్రయాణిస్తున్న మాబూసాబ్, ఫక్రుద్దీన్, శ్రీనివాసులు, హసన్‌సాబ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వీరిని చికిత్స నిమిత్తం కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో యువకుడి ప్రతిభ

హిందూపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులో మే 30, 31న జరిగిన రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో హిందూపురానికి చెందిన యువకుడు ఆఫ్రీద్ ఖాన్ ప్రతిభ కనబరిచాడు. చదరంగం పోటీల్లో 6.5 పాయింట్లు సాధించి మొదటి స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ సలహామండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి, రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మస్తాన్ బాబు యువకుడికి రూ.20 వేల నగదు బహుమతితో పాటు ట్రోఫీ, మెడల్‌ను అందజేశారు. చదరంగం రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచడంపై కోచ్ ఆరీఫ్‌వుల్లా తదితరులు యువకుడిని అభినందించారు.

నేడు ‘గడప గడపకూ మన ప్రభుత్వం’

కదిరి అర్బన్: మండల పరిధిలోని పట్నం సచివాలయం పరిధిలోని మాచిరెడ్డిపల్లి, పట్నం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ ప్రకాష్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరువుతారని తెలిపారు. పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల సభ్యులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

3న అరుణాచలానికి బస్సు

కదిరి అర్బన్: అరుణాచలం పుణ్యక్షేత్రంలో గిరిప్రదక్షిణ చేసేందుకు ఈనెల 3న కదిరి నుంచి ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నట్లు డిఎం మైనుద్దీన్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బస్సులో కాణిపాకం, గోల్డ్ టెంపుల్‌ను కూడా దర్శించవచ్చన్నారు. పెద్దలకు టికెట్ ధర రూ.860, పిల్లలకు రూ.450 ఉంటుందన్నారు. భక్తులకు ముందస్తు రిజర్వేషన్ సదుపాయం కూడా ఉందన్నారు. 8125916181 నంబర్‌కు ఫోన్ పే చేసి టికెట్లు పొందవచ్చని పేర్కొన్నారు.

సర్వేతో భూ సమస్యలకు చెక్

ఎన్పీకుంట: ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష కార్యక్రమం ద్వారా చేపట్టే భూముల సర్వేతో సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ రవినాయక్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని పెడబల్లి సచివాలయంలో త్వరలో ప్రారంభించే రీసర్వేపై రైతులు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రీ సర్వే ద్వారా ప్రతి హక్కుదారుడికి భవిష్యత్‌లో తగాదాలు లేకుండా శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. మరో మూడు రోజుల్లో పెడబల్లి పంచాయతీలో రీసర్వే ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. భూసర్వేకు రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ గంగన్న, గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా రమణ

ఎన్పీకుంట: సీపీఐ మండల నూతన కార్యదర్శిగా జి.రమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం స్థానిక శివాలయం వద్ద సీపీఐ జిల్లా కార్యదర్శి సభ్యులు వేమయ్య యాదవ్ అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 13 మంది సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా ఉన్న రామ్మోహన్‌ను రైతు సంఘం మండల కార్యదర్శిగా నియమించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రాజేంద్ర, డివిజన్ సెక్రటరీ కదిరప్ప, సహాయ కార్యదర్శి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్మిషన్ల ప్రారంభం

కదిరి అర్బన్: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ చెన్నకేశవ ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో అన్ని గ్రూపులు ఇంగ్లిష్, తెలుగు మీడియంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జనరల్ కోర్సుల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఈసీఎల్, ఎంహెచ్‌సీ(ఉర్దూ) ఉన్నాయన్నారు. వృత్తి విద్యా కోర్సులో ఎంఎల్‌టీ, సెరికల్చర్, సీఎస్‌సీ ఉన్నాయని పేర్కొన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమైనట్లు వెల్లడించారు.

యువతి అదృశ్యం

బత్తలపల్లి: మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామానికి చెందిన యువతి మమత గత నెల 29వ తేదీ నుంచి కనిపించడం లేదని తండ్రి సాకే రామకృష్ణ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో విచారించినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

పుట్టపర్తి అర్బన్: బాల్య వివాహాలతో అనర్థాలు చోటుచేసుకుంటాయని, పుస్తకాలు మోసే వయస్సులో పుస్తెలతాడు వద్దని ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. గురువారం పుట్టపర్తి మండలం పెడపల్లి అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మానవహారం ఏర్పాటు చేసి, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేసుకోము.. బేటీ బచావో బేటీ పడావో అంటూ నినాదాలు చేస్తూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీడీపీఓ గాయత్రి, జిల్లా ఐసీపీఎస్ కౌన్సిలర్ సంధ్య, సూపర్‌వైజర్ నాగరాణి తదితరులు మాట్లాడారు. బాలికలపై లింగ వివక్ష చూపకుండా మగ పిల్లలతో సమానంగా చూడాలన్నారు. విద్యాహక్కు చట్టం, సర్వశిక్ష అభియాన్, మధ్యాహ్న భోజనం, స్కాలర్‌షిప్‌పై వివరించారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ధర్మవరం డివిజన్

9912220727, 9912220726, 9010593486